క్లుప్తంగా

శివయ్యా.. మా సారు ప్రాణాలు కాపాడయ్యా..


పూజాకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కుల్కచర్ల: శివయ్యా.. మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ప్రాణాలను కాపాడాలంటూ విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు స్థానిక దేవాలయంలో పూజలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్ల మండలం కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పొలినాయుడు విధులు నిర్వహించేవారు. ఇటీవల ఆయన క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తమ సహచరుడు వ్యాధితో పోరాడుతుండగా.. త్వరగా కోలుకోవాలని కుస్మసముద్రం శివాలయంలో లింగేశ్వరుడికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాస్య, ప్రాథమిక పాఠశాల చైర్మన్ చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం


శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

ధారూరు: శ్రీసాయి కాలేజ్ ఆఫ్ డెంటల్ సర్జరీ డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో ధారూర్ మండలం ధర్మాపూర్‌లో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి దంతాలు శుభ్రం చేశారు. పుప్పి పళ్లున్న వారివి తొలగించారు. పలువురిని దంత కళాశాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు అబ్దుల్ వాసే, సాయికుమార్, లీలా లోహిత, శివాని, దేదిప్య, జయకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల బలవంత్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. కళాశాలలు మంజూరయ్యాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. వాటి ఊసే లేకుండా పోయిందని, కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నియోజకవర్గ కేంద్రానికి విద్యార్థులు సమయానికి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కళాశాలల ఏర్పాటుకు కృషిచేయాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో మద్దూరుకు చెందిన రమేష్, దుద్యాల మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన ఎల్లప్ప కుటుంబానికి అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నయీం, శ్రీనివాస్‌రెడ్డి, ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

ధారూరు: ధారూరు మండలం చింతకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన బాలబాలికలకు ఉపాధ్యాయులు అక్షరాలు దిద్దించారు. అదే గ్రామానికి చెందిన విష్ణు కొత్తగా చేరిన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు, వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ అరుణ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

బొడ్రాయికి బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం రాంనగర్‌లో గ్రామస్తులు శుక్రవారం బొడ్రాయికి బోనాలు సమర్పించారు. బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది అయిన సందర్భంగా స్థానికులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి, నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు.

పంట మార్పిడ్దాం.. దిగుబడి పెంచుదాం..

- చీడపీడల కట్టడికి మార్గం
- పంటమార్పిడితో భూసారం వృద్ధి


విత్తనాలు వేస్తున్న రైతులు

పరిగి: ఒకే రకమైన పంట సాగు చేయడం వలన.. పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల ఉండదు. అంతేకాకుండా ఎక్కువగా ఆ పంట రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ నిపుణులు, అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఒకే రకమైన పంటలు సాగు చేసి, ఆశించిన దిగుబడి పొందక రైతులు అప్పుల పాలవుతున్నారని, పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడిసాధించి ఆర్థికంగా ఎదిగేందుకు వీలుంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పంట మార్పిడి ప్రాధాన్యం

ఒక పంటను ఒకే పొలంలో వరుసగా సాగు చేయడం వలన చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకొని, తీవ్రమైన హానీ కలిగించే స్థితికి చేరుకుంటుంది. పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం ఛేదించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక పంటపై ఆశించడం సాధారణంగా జరగదు. వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంటమార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు. ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప, మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వలన.. ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది. వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి. నేల భౌతిక లక్షణాల స్వభావం దెబ్బతినకుండా ఉండానికి చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంటమార్పిడి చేయాలి. అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

కలిగే లాభాలు

వరి తర్వాత వినుము, పెసర, శనగ, వేయడం వలన సుడిదోమ, టుంగ్రో వైరస్ నివారించవచ్చు. పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగుల బెడద ఉండదు. జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతం తగ్గుతుంది. వరి సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పు ధాన్యాలను సాగు చేయడం వలన నేల సారవంతమవుతుంది. వేరుశనగలో ఆకు ముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి. కంది మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి. నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వెరుశనగ, మిరప వంటి పైర్ల సాగును కొన్ని పంట కాలల వరకు ఆపాలి. ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పు జాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగ, పంటలతో మార్పిడి చేయాలి. ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

అధిక దిగుబడి



రైతులు ఒకే పంటను పలుమార్లు సాగు చేయరాదు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలను పండించడం వలన.. ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువై దిగుబడి తగ్గిపోతుంది. అంతే కాకుండా రోగకారక పురుగు జీవితచక్రం ముగించుకొని రోగాల ఉధృతి పెరుగుతుంది. అందుకే రైతులు వరుసగా ఒకే రకమైన పంటను సాగు చేయవద్దు.

– ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పరిగి

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి


కళాజాతలో మాట్లాడుతున్న సీఐ అప్పయ్య

ధారూరు: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ధారూరు సర్కిల్ సీఐ అప్పయ్య అన్నారు. ధారూరు మండలం దోర్నాల్‌లో శుక్రవారం నిర్వహించిన పోలీసు కళాజాత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలో పెరుగుతున్న ఆర్థిక నేరాలు, మోసాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. డయల్ 100 నంబర్, సైబర్ క్రైం, మహిళల రక్షణపై కళా బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మోసాలకు పాల్పడుతున్న వారు ఎక్కువయ్యారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ కిట్స్‌ను వినియోగించుకోండి


మినీ కిట్స్ అందజేస్తున్న జెడ్పీటీసీ సంతోష

బంట్వారం: నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్ఎఫ్ఎస్‌సీ) మిషన్ కింద రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న మినీ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సంతోష అన్నారు. శుక్రవారం బంట్వారం రైతు వేదికలో ఆమె రైతులకు రెడ్ గ్రాం మినీ కిట్స్‌ను అందజేసి మాట్లాడారు. ఎన్ఎఫ్ఎస్‌సీ మినీకిట్స్ మండలానికి 9 క్వింటాళ్లు వచ్చాయని, అవసరమైన రైతులు తీసుకొని, పొలాల్లో వేయాలన్నారు. ఒక్కో మినీకిట్ నాలుగు కిలోలు ఉంటుందన్నారు. నేలల సారవంతాన్ని బట్టి కిట్స్‌ను కేంద్రం సరఫరా చేస్తుందని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ సంధ్య, ఏఈఓలు మశ్చందర్, అశ్విని, బస్వాపూర్ సర్పంచ్ తలారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దోమ: కొండాయపల్లి గ్రామానికి చెందిన చాకలి వెంకటయ్య శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి స్థానిక నేతలతో వెంకటయ్య అంత్యక్రియల ఖర్చు నిమిత్తం.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

వంటగది పూర్తయ్యేదెన్నడో?

నాలుగేళ్లు గడిచినా.. ముందుకు సాగని వైనం


నిలిచిపోయిన వంటగది నిర్మాణ పనులు

పెద్దేముల్: నాలుగేళ్ల గడిచినా కిచెన్ షెడ్(వంటగది) పూర్తి కాక.. ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. పెద్దేముల్ మండలం బుద్ధారం ప్రాథమిక పాఠశాలకు నాలుగేళ్ల క్రితం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో వంట గది మంజూరు చేశారు. అప్పట్లో పనులు ప్రారంభం చేసి, బిల్లు సమయానికి రాక పోవడంతో నిర్మాణదారుడు పనులు మధ్యలో నిలిపేశారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోక పోవడంతో వంట గది దిష్టి బొమ్మలా మిగిలింది. దీంతో వంట నిర్వాహకులు వంటను పక్కనే ఉన్న పురాతన పాఠశాల భవనంలో పూర్తిచేసి, విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు. ఇదే విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ అధికారి పట్టించుకోలేదని సర్పంచ్ లక్ష్మి వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. వంటశాలల పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వంటగది లేక నాలుగేళ్లుగా ఆయాలు ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు వంటశాల గది పూర్తి చేయించి, వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి నోచుకోని బొంరాస్‌పేట


మాట్లాడుతున్న సమితి నాయకులు

బొంరాస్‌పేట: ఉమ్మడి రాష్ట్రంలో బొంరాస్‌పేట అతి పెద్ద మండలంగా పేరొందినప్పటికీ.. నేటి వరకు విద్యాభివృద్ధికి నోచుకోలేదని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రాథోడ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సమితి నాయకులతో కలిసి మాట్లాడారు. 2017లో మండలానికి జూనియర్ కళాశాల మంజూరు అయిందని చెబుతున్నారే తప్పా.. ఇంత వరకు ప్రారంభం కాలేదని చెప్పారు. సంవత్సరాలు గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడలా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, భద్రూనాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, దశరథ్ లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


కరపత్రాలతో నేతల నిరసన

పెద్దేముల్: గూడు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలకు ఇళ్ల పట్టాలు అందచేసి, రూ.3లక్షల బదులు రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 26న వికారాబాద్‌కు చేరుకోనున్న బస్సు యాత్రకు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కేవీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, రాజు, లింగేష్, విజయకుమార్, అంజిలప్ప, పద్మమ్మ, లక్ష్మీ, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పథకాలు

పరిగి: పరిగి మండలం పేటమాదారం గ్రామానికి చెందిన ఇస్తారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్నాడు. అనంతరం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.42వేల చెక్కును ఎంపీపీ అరవింద్‌రావు శుక్రవారం బాధితునికి ఇంటికి వెళ్లి అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహాలింగం, నర్సింహులు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగు పెరగాలి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: పప్పు దినుసుల సాగు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్నదాతలకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్ఎఫ్ఎస్ఎస్) పథకంలో భాగంగా మంజూరైన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలో కంది సాగు పెంచేందుకు ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. పెద్దేముల్ మండలానికి కందులు 16 క్వింటాళ్లు, మినుములు 28 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గాజీపూర్ ఎంపీటీసీ వెంకటేశ్‌చారీ, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రైతులు నరేష్‌రెడ్డి, శీల్లి, సంఘమేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో..


అల్లాపూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్: అల్లాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. శుక్రవారం గోపూజ, గణపతి పూజ, విగ్రహ అభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొని రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం పరమాత్మానందగిరిస్వామి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అమర్‌నాథ్‌గౌడ్, పెద్ద నర్సింహులు గౌడ్, విజయ్‌కుమార్, బీరప్ప, నర్సిరెడ్డి, కిషోర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం నారాయణపూర్‌లో రైతు వేదిక క్లస్టర్‌లో రైతులకు 100శాతం సబ్సిడీతో కూడిన ఉచిత కంది విత్తనాలు అందజేశారు. అనంతరం అడ్వకేట్స్‌తో రైతు హక్కులపై.. అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, సాగు మొదలు దిగుబడి విక్రయించే వరకు వారికి అండగా ఉంటారని తెలిపారు. వ్యవసాయ అధికారులు అందిస్తున్న సలహాలు, సూచనలు పాటించి, అధిక దిగుబడి పొందేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, డీఏఓ గోపాల్, ఎంపీడీఓ సత్తయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, వెంకటయ్య, రాములు నాయక్, ఏఓ జ్యోతి, ఏఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు చేయూత


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మేదర సంఘం నాయకులు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వం కుల వృత్తులకు చేయూతనిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. కుల వృత్తులకు రూ.1లక్ష ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేస్తూ శుక్రవారం మేదర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కుల వృత్తుల వారు ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వాలు చేతి వృత్తులను విస్మరించాయని, కానీ సీఎం కేసీఆర్ వారిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మౌలానా, మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


మాట నిలబెట్టుకోని ముఖ్యమంత్రి


నిరసన వ్యక్తంచేస్తున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతగిరి: ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథల సంక్షేమం కోసం.. వసతి గృహం నిర్మిస్తానని మాట ఇచ్చి, తప్పారని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ ఆనంద్, ఎమ్మార్పీఎస్ కోఆర్డినేటర్ మల్లికార్జున్ ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక.. 2015లో యాదగిరిగుట్టలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న అనాథలందరికీ సంక్షేమ హాస్టల్ వలే ఒక పెద్ద భవనాన్ని నిర్మించి, నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కానీ 9ఏళ్లు గడిచినా నేటికీ ఆ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేని యెడలా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీక్షలో మహిళా నాయకురాలు పుష్ప, గుమ్మడి మల్లేశం, రవికుమార్, మల్కప్ప, సుభాష్, మహేందర్, నర్సింహులు, మోహన్ జాని, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులపై వివక్ష

- మారనిగీత కార్మికుల తలరాత
- ఆర్థిక సాయం జాబితాలో దక్కని చోటు
- ఆందోళన చెందుతున్న గౌడ్‌లు



దౌల్తాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఈనెల 9నుంచి 20వ తేదీ వరకు బీసీ కుల వృత్తులు, చేతివృత్తుల వారికి రూ.1లక్ష ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించి, మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే సాయమందించే జాబితాలో గీత కార్మికులు లేకపోవడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు. కల్లుగీత వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న వారిపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని బీసీ సంఘం గీత కార్మికులు వాపోతున్నారు. మంగళవారం నాటికి గడువు ముగియడంతో ఏం చేయాలో తెలియక బీసీలోని మిగతా కులాల వారు కలవర పడుతున్నారు.

వృత్తిపై బెల్టు దెబ్బ

తెలంగాణ ఆవిర్భంచినప్పటికీ ప్రభుత్వం గీత కార్మికులపై వివక్ష చూపుతుందని గీత కార్మికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు పెరిగిపోతున్నా.. ప్రభుత్వం అక్రమ మద్యం దుకాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా గీత వృత్తిపై ప్రభావం పడుతుందని వాపోతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొట్టకూటికోసం తాటి, ఈత చెట్లు ఎక్కి కల్లు గీసుకొని జీవించే తమ జీవితాలకు ఎటువంటి గ్యారంటీ లేదని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ప్రమాదబీమా తప్ప ప్రభుత్వం నుంచి మరే సాయం లేదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గీత కార్మికులకు సైకిళ్లు, మోపెడ్లు తదితర వాటిని రాయితీపై ఇచ్చిందని గుర్తు చేశారు.

సుమారు వెయ్యిమంది..

దౌల్తాబాద్ మండలం 33 గ్రామపంచాయతీల్లో వెయ్యిమంది కార్మికులు ఉన్నారు. ఇందులో సుమారు 800 వరకు గుర్తింపు కార్డులు పొంది ఉన్నారు. కుల వృత్తిని నమ్ముకొని, గుర్తింపు కార్డులు పొందని వారు చాలా మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం సాయం అందించే కులవృత్తి జాబితాలో లేకపోవడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

దురదృష్టకరం..



బీసీ కులవృత్తి రూ.1లక్ష సాయం జాబితాలో గీత కార్మికులకు అవకాశం లేకపోవడం దురదృష్టకరం. వృత్తిదారులందరికీ రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లిస్ట్‌లో గీత కార్మికులకు చోటు దక్కకపోవడం అవమానంగా ఉంది.

– కాశప్ప, టీఎఫ్‌టీ లైసెన్స్ దారుడు, బిచ్చాల

అందరికీ సాయమందించాలి



రాజకీయ నాయకుల జోక్యం లేకుండా బీసీ కులాలందరికీ రుణాలు ఇవ్వాలి. గీత వృత్తిదారులను పక్కన పెట్టడం సరైంది కాదు. ఒక్క బీమా తప్పితే గీత వృత్తి దారులకు మరే ప్రయోజనం లేదు. ప్రభుత్వం గడువు పెంచి గీత వృత్తిదారులకు రూ.లక్ష రుణం వచ్చేలా చూడాలి.

– నర్సింహులు గౌడ్, దౌల్తాబాద్